


# త్వరలో తీర ప్రాంత గ్రామాలకు తెలుగంగ జలాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు

వాకాడు, జులై 14 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీర ప్రాంత గ్రామాలకు తెలుగంగ జలాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని గూడూరు శాసన సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావు తెలిపారు. శుక్రవారం వాకాడు మండలం నిడిగుర్తి సచివాలయం పరిధిలోని జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరగా తెలుగంగ కాలువ నిర్మాణం పనులపై ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లి ఈ ప్రాంతముకు తేలికంగా జలాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అదే విధంగా 32 గ్రామాలకు సంబంధించి ఎన్నో ఏళ్లకు తీర ప్రాంతం గ్రామాలు అందాకారంలో ఎదురుచూస్తున్నాయని, ఈ ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్ అన్నారు. మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి కూడా అంగీకరం తెలిపారని, వెంటనే సంబంధించి విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందించారని సభాముఖంగా తెలిపారు. అదే విధంగా జియో సెల్ టవర్ కూడా వస్తుందన్నారు. తీర ప్రాంత గ్రామాలు జగనన్న ప్రభుత్వంలో అభివృద్ధి అంచులంచుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దువ్వూరు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఆర్ఐ సెల్వరాజ్, మాజీ ఎంపిపి దువ్వూరు మధుసూధన్ రెడ్డి, నల్లపురెడ్డి, తిరుమూరు విజయరత్నం, ఎస్ఐ రఘునాథ్, డాక్టర్ రామకృష్ణ, పెళ్లూరు కోటిరెడ్డి, సచివాలయ సిబ్బంది, సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తగ్గేదేలే!

- మామా కాచుకో వచ్చేస్తున్నాం
- చంద్రయాన్-3ని అంతరిక్షంలోకి క్షేమంగా చేర్చిన బాహుబలి రాకెట్
- ఈ ఏడాది షార్ నుంచి అన్ని విభిన్న తరహా ప్రయోగాలే
- ఇది ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో సరికొత్త చరిత్ర
- ఇస్రో ఛైర్మన్ సోమనాథ్
- ప్రయోగం తర్వాత ఈలలు, కేకలతో దద్దరిల్లిన అంతరిక్ష కేంద్రం
- విజిటర్స్ గ్యాలరీలో పదివేలకు పైగా వీక్షకులు
- కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా కదలివచ్చిన సందర్శకులు
- సంబరాల్లో ఇస్రో శాస్త్రవేత్తలు - షార్ అంతా పులకింతే

**శ్రీహరికోట (తడ), జూలై 14 ప్రభాతవార్త**

శ్రీహరికోట...చప్పట్లు ఈలలతో దద్దరిల్లిన వేళ. శుక్రవారం మధ్యాహ్నం.. ఇది పండగ కాదు, తిరునాళ్లలా హాజరైన జనం. ఒక్క చంద్రయాన్-3 ప్రయోగం కోసం దేశం మొత్తం పులకించిన వేళ. అదిరిందయ్యా చంద్రం అంటూ మన బాహుబలి రాకెట్ తొలిదశను విజయవంతంగా ముగించింది. శుక్రవారం మధ్యాహ్నం షార్‌లోని రెండవ ప్రయోగ వేదిక నుంచి అతిపెద్ద సరుగుడు చెట్ల నుంచి భారత బాహుబలి రాకెట్ గగన తలానికి దూసుకెళ్లింది. ఆ సమయాన రెండు స్ట్రాపాన్ మోటార్లు అంటుకున్నప్పుడు గర్జనలు వచ్చాయి. అయితే అవి వీక్షకుల సందర్శకుల చప్పట్లు, ఈలల మధ్య చిన్నబోయాయి. మీడియా సెంటర్‌లో కూడా భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు వినిపించాయి. వేలమంది సిఐఎస్ఎఫ్ దళాలు, పోలీసులు సైతం ఉత్సాహంగా ఈ రాకెట్ ప్రయాణాన్ని వీక్షించారు. ఇటు రాకెట్ నింగికి ఎగురుతుంటే, అటు వైపు తెల్లటి దట్టమైన మేఘాలు ఉండటంతో ఈ ప్రయాణం కొన్ని నిమిషాల పాటు చక్కగా కనిపించింది. కేవలం షార్‌లోనే కాకుండా సమీపంలోని పులికాట్ దీవులకు వేసిన రోడ్లలోనూ సందర్శకులు బారులు తీరి రాకెట్ ప్రయోగాన్ని వీక్షించారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, వాకాడు తీరప్రాంత మండలాల ప్రజలు ఈ రాకెట్‌ను చాలా దగ్గరగా చూసినట్లుగా అనిపించిందని చెప్పారు. 16 నిమిషాలకు పైగా ప్రయాణించిన రాకెట్ గతంలో ఎన్నడూ లేని విధంగా అసలు సిసలైన కక్ష్యలో చంద్రయాన్-3ని ప్రవేశపెట్టింది. ఇదే విషయాన్ని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ కూడా ప్రకటించారు. ఖచ్చితమైన ఆర్బిట్‌లో రాకెట్ ఈ ఉపగ్రహాన్ని చేర్చిందని, ఇక 41 రోజుల అనంతరం సాఫ్ట్ ల్యాండింగే మిగిలిందని ఆయన చెప్పారు. మిషన్ కంట్రోల్ సెంటర్‌లో సోమనాథ్ తక్కువగా మాట్లాడి కేంద్రమంత్రి జితేంద్రసింగ్, ఇతర శాస్త్రవేత్తల చేత ఎక్కువగా మాట్లాడించారు.



శ్రీహరికోట నుంచి శుక్రవారం అంతరిక్షానికి నిచ్చెన వేసిన బాహుబలి రాకెట్



అంతరిక్షంలో ఉపగ్రహాన్ని విడిచిపెడుతున్న రాకెట్

## అంతరిక్షమే హద్దు..

భారత అంతరిక్ష ప్రయోగ విజయాలలో కీలకపాత్ర పోషిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలను సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖమంత్రి జితేంద్రసింగ్ అభినందించారు. ప్రధాని నరేంద్రమోడీకి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. శ్రీహరికోట నుంచి పదేపదే రాకెట్ల ప్రయోగానికి తలుపులు తెరిచిన ప్రధాని దేశ శాస్త్ర సాంకేతిక రంగాల మీద పూర్తి దృష్టి కేంద్రీకరించారని చెప్పారు. ఆరు దశాబ్దాల ముందు విక్రమ్‌సారాబాయ్ ఈ ద్వీపాన్ని కనుగొని ఇక్కడ రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పరిచారని, ప్రస్తుతం ఖండాంతరాలు దాటుకొని మన ఘనత ప్రపంచానికి చాటిచెబుతోందని చెప్పారు. ఆత్మ నిర్బర్‌భారత్‌లో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు జితేంద్రసింగ్ చెప్పారు. చంద్రయాన్-3 ప్రయోగంలో కీలకపాత్ర పోషించిన ప్రాజెక్టు డైరెక్టర్ వీరముత్తువేల్, మిషన్ డైరెక్టర్ మోహన్‌కుమార్‌లు ప్రత్యేకంగా మాట్లాడారు. తమకు ఇక సాఫ్ట్ ల్యాండింగ్ సక్రమంగా జరిగితే చంద్రునిపై పరిశోధనలకు వీలవుతుందని వీరు పేర్కొన్నారు.

షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, యుఆర్‌రావు స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎం.శంకరన్, శాటిలైట్ అప్లికేషన్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ ఎం.దేశాయ్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ నారాయణన్, ఎంఎస్ఎ గ్రూపు డైరెక్టర్ పి.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రాకెట్ ప్రయోగ వీక్షణకు మాజీ ఇస్రో ఛైర్మన్లు కె.శివన్, డాక్టర్ రాధాకృష్ణన్, ఎఎస్ కిరణ్‌కుమార్‌లు వచ్చి ఎంసిసి నుంచి ప్రయోగాన్ని తిలకించారు. రాష్ట్రమంత్రులు గుడివాడ అమర్నాథ్, సీదిరి అప్పలరాజు, తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఏపీ, తెలంగాణాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు చంద్రయాన్-3 ప్రయోగాన్ని దగ్గరగా వీక్షించారు. కేంద్ర పారిశ్రామిక భద్రత దళాలతో పాటు తిరుపతి జిల్లా పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. సూళ్లూరుపేట బైపాస్ సర్కిల్ నుంచి శ్రీహరికోటలోని మొదటిగేటు దాకా చీమల్లా వాహనాలు బారులు తీరాయి. పలుచోట్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయితే పోలీసులు అనేక మలుపుల్లో ఉండి వాహనాలను క్రమబద్దీకరించారు.









# ఆంధ్రాకు..నై..నైనై..!

**-మితిమీరుతున్న ఇసుకాసురులు**
**-కానరాని అధికారుల చర్యలు**

# తమిళనాడుకు రైయ్..రైయ్!


ఎన్ఎం కండ్రిగలో ఇంటి వద్ద ఇసుక డంప్‌లు

సత్యవేడు, జూలై 14 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలో ఇసుకాసురుల ఆగడాలు రోజు, రోజు మితిపోతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇక్కడ గృహనిర్మాణాలకు ఇసుక కావాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. సత్యవేడు మండల ప్రాంతం తమిళనాడుకు సరిహద్దుగా ఉండటంతో ఇసుకాసురులు తమ అక్రమ వ్యాపారాలను సాఫీగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు ప్రాంతాల్లో ఇసుక కొరత కారణంగా మంచి గిరాకీ పలుకుతుండటం వీరికి భాగా కలిసి వచ్చింది. ట్రక్కు ఇసుక రూ॥ 12వేలు నుంచి 15వేలు వరకు చెల్లించి, అక్కడి వారు గృహనిర్మాణాలకు ఇసుకను కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో ఇసుక అక్రమ వ్యాపారాలు చేస్తున్న యాజమానులు 'ఆంధ్రాకు నైనై.. తమిళనాడుకు రైయ్‌రైయ్' అంటూ ఇసుకను తరలించేస్తున్నారు. అంతేకాకుండా సత్యవేడుకు కూతవేటు దూరంలోని తమిళనాడు గ్రామమైన ఎన్ఎ కండ్రిగలో ప్రతి ఇంటి వద్ద ఇసుక డంప్‌లు ఏర్పాటు చేసి మరీ, అనుమానం రాకుండా అక్రమవ్యాపారాలకు పాల్పడుతున్నారు. సత్యవేడు నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు నుండే అక్రమ రవాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇంతకీ ఇక్కడ ఇసుక రీచ్‌ల విషయంలో సంబంధిత అధికారులకు సైతం ఎవరి అజమాయిషీతో ఇసుక రవాణ జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. ఇసుక రవాణా విషయమై రెవిన్యూ అధికారులను ప్రశ్నించినా తమవద్ద ఎలాంటి సమాఛారం లేదంటూ దాటవేస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

**-పట్టుకుంటే ఒట్టు-ఇసుకాసురుల కనికట్టు:**

సత్యవేడు మండల కేంద్రం మీదుగా తమిళనాడు ప్రాంతాలకు యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న సంబంధిత రెవిన్యూ, పోలీస్ అధికారుల చర్యలు కానరావడం లేదని స్థానికులు చర్ఛించుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను చెప్పుకోదగినట్లుగా పోలీసులు అడ్డుకున్న దాఖలాలు అంతంత మాత్రమే. తాయిళాల సమర్పణ, అధికార పార్టీ నేతల ఒత్తిళ్ళుతో అక్రమ కార్యకలాపాలకు సత్యవేడు నెలవుగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదనుగా భావించిన ఇసుకాసురులు తమిళనాడుకు ఇసుకను తరలిస్తూ వేలాది రూపాయలను జేబుల్లో వేసుకుంటున్నారు. దీంతో ఇక్కడ ఇసుక కొరత ఏర్పడి, డిమాండ్ పెరిగిపోతున్నది, పేదవాడు ఇళ్ళు నిర్మించుకునే పరిస్థితులు లేకుండా పోతున్నాయి. ఇకనైనా ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

# దర్జాగా ఇసుక,మట్టి అక్రమ తవ్వకాలు!

**-స్మశానాలను సైతం వదలని అక్రమార్కులు -యథేచ్ఛగా కర్ణాటకకు ఇసుక తరలింపు - చోద్యం చూస్తున్న అధికారులు.**



అమ్మరాజుపల్లిలో అక్రంగా ఇసుక నిల్వఉంచిన దృశ్యం

పెద్దపంజాణి జూలై14 ప్రభాతవార్త : పెద్దపంజాణి మండలం అమ్మరాజు పల్లి గ్రామపరిధిలో ఇసుక,మట్టి బకాసురులు ఇసుక,మట్టి తవ్వకాలను దర్జాగా చేపడుతున్నారు. పగలు,రాత్రి తేడా లేకుండా ఇసుక,మట్టిని అటవీ ప్రాంతం, స్థానికంగా ఉన్న చెరువులు,వాగులు,వంకలనుండి కొల్లగొట్టి యదేచ్ఛగా పక్కనేఉన్న కర్ణాటక రాష్ట్రంకు అక్రమంగా తరలించి లక్షలు ఆర్జిస్తున్నారు. అక్రమ దందాలను అరికట్టాల్సి న అధికారయంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. చివరకు ఇసుక అక్రమ వ్యాపారులు స్మశానలను సైతం వదలండం లేదంటే ఈ ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా ఏవిధంగా సాగుతుందో ఇట్లే ఊహించుకోవచ్చు.అధికారపార్టీకి చెందిన కొంతమంది నేతలు ఈ ఇసుక, మట్టి తరిలింపు వ్యవహారానికి శ్రీకారం చుట్టారని మండల ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు.అధికారులను ఆమ్యామ్యాలకు అలవాటుచేసి ఇసుక,మట్టిని అక్రమంగా కొల్లగొడుతూ కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటు న్నట్లు ప్రజలు తీవ్రంగా విమర్శి స్తున్నారు. సర్వే నెంబర్ 9/4ఎ లో ఉన్న డీకేటీ భూమిలో సైతం అక్రమ ఇసుక తవ్వకాలను జెసిబిల సహాయంతో చేపడుతున్నారు. ఈ విషయంగా స్థానిక సర్పంచ్‌కూడా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.అటు ప్రభుత్వస్థలాలైన డీకేటీ భూములతో పాటు చెరువులు, వాగులనుంచి సైతం నిత్యం పదుల సంఖ్యల ట్రాక్టర్లతో ఇసుకను అక్రమంగా తరలించి ఓ చోట డంపింగ్ చేసుకుంటున్నారు.అనంతరం రాత్రివేళ కర్ణాటకకు టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమరవాణా చేస్తున్నట్లు తెలిసింది.కర్ణాటక రాష్ట్రంలో భవన నిర్మణాలకు అధిక ప్రాధాన్యత ఉండటం అక్కడ ఇసుక డిమాండ్ ఉండగంతో స్థానికంగా ఉన్న కొంతమంది అధికార పార్టీనేతలు ఇసుక అక్రమ రవాణానే తమ వ్యాపారంగా మార్చుకుని మూడుపువ్వులు,ఆరుకాయలు అన్న చందాన ఇసుక అక్రమ దందాను కొనసాగిస్తున్నారు.అయితే ఇసుక అక్రమ రవాణాకు అరికట్టాల్సి న అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తుడంతో మండలంలోవున్న తెల్ల బంగారంను అక్రమ వ్యాపారులు కొల్లగొడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అమ్మరాజుపల్లి ప్రాంతంలో అక్రమ ఇసుక,మట్టి రవాణాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

## నైతిక విలువలను పాటిస్తూ...

# క్రమశిక్షణతో విధులు

**సంక్షేమ దివాస్ కార్యక్రమం నిర్వహించాలి -జిల్లా ఎస్పి పి.పరమేశ్వర రెడ్డి**



తిరుపతి క్రైం, జులై 14 ప్రభాతవార్త : పోలీస్ అధికారులు, సిబ్బంది నైతిక విలువలను పాటిస్తూ క్రమశిక్షణతో నిధులు నిర్వహించాలని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం పోలీస్ సిబ్బంది యోగక్షేమాలు, ఆరోగ్య విషయాలు, శాఖా పరమైన సమస్యలను విచారించి తెలుసుకుని సకాలంలో పరిష్కరించేలనే ముఖ్య ఉద్దేశ్యంతో సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి శుక్రవారం నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్ నందు ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ సిబ్బంది కవాతును తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి పరిశీలన చేసి, సిబ్బంది యొక్క సమస్యలను యోగక్షేమా లను గురించి ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి జిల్లా ఎస్పి మాట్లాడుతూ శాఖా పరమైనటువంటి అంశాలలో ఏదైనా సమస్యలు ఉంటే ప్రతి శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నందు సంక్షేమ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మీ సమస్యలను నేరుగా విన్నవించుకోవచ్చు అని ఆ సమస్యపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టి సకాలంలో పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని కలిగి ఉండాలని అప్పుడే ప్రజల వద్దకు వెళ్లగలుగుతాము మెరుగైన సేవలను కూడా అందించడానికి ఒక ఆత్మ విశ్వాసం కలుగుతుంది. పోలీస్ అంటేనే 24/7 విధులలో ఉండాలని మనకు దొరికిన సమయంలో ప్రతి రోజూ వ్యాయామం, యోగా మొదలగునని క్రమం తప్పకుండా చేయడం వలన ఆరోగ్యపరంగా మరింత దృఢంగా ఉండి, ఇంకా మెరుగైన పనితీరును కనబరచడానికి దోహదపడు తుందన్నారు. సిబ్బంది ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఆరోగ్య పరమైనటువంటి ఏదైనా ఇబ్బందులు ఉంటే జిల్లా పోలీస్ ఆసుపత్రి సేవలను వినియోగించు కోవాలన్నారు. పోలీస్ వారికి విశ్రాంతి సమయం దొరకడం కొంతమేర అరుదు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పి లక్ష్మీనారాయణ రెడ్డి, ఏఆర్ డిఎస్పిలు రవీంద్ర రెడ్డి, నందకిషోర్, ఆర్ఐలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, నాగభూషణం, చలపతి, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీటీ

**-కాణిపాకం ఆలయ ఛైర్మన్, ఈఓలు**

కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త: రాష్ట్రంలో హిందూ ధర్మ పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీటీ వేస్తున్నట్లు కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు అన్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులు, అర్చకుల వయో పరిమితిని రెండేళ్ళు పెంచడంతో పాటు చిన్న ఆలయాల అర్చకుల వయో పరిమితిని తొలగిస్తూ రాష్ట్ర కేబినేట్ నిర్ణయం తీసుకోవడంతో శుక్రవారం ఆలయ అర్చకులు, ఉద్యోగులతో కలసి ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల అభివృద్ధికి, ఆలయాల ఆస్తుల పరిరక్షణకు ఉద్యోగులు, అర్చకులు సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే దేవాదాయశాఖ పరిధిలోని దేవాలయాలకు సంభందించి ఆస్తులు, భూముల పరిరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకు రావడంతో ఈభూములు అన్యాక్రాంతం కాకుండా నిషేదిత భూముల జాబితాలో చేర్చినట్లు మోహన రెడ్డి, వెంకటేశులు తెలిపారు. అర్చకులు, ఉద్యోగుల వయో పరిమితిని పెంచడంతో పాటు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుకోవడంతో తక్కువ జీతాలు వున్న రాష్ట్రంలోని అర్చకులు, ఉద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని వారు తెలిపారు. దేవాదాయశాఖ ఉద్యోగులు, అర్చకుల సంక్షేమం కోసం ఈనిర్ణయాలు తీసుకున్న సీఎం జగన్, మంత్రులు కొట్టు సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, శారదాపీఠాధిపతులు, దేవాదాయశాఖ కమీషనర్ సత్యనారాయణ, శాఖ సలహాదారు జ్వాలా శ్రీకాంత్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## తహశీల్దార్ కార్యాలయంలో ఉరేసుకుని...

# విఆర్ఏ ఆత్మహత్య

గుడుపల్లె, జూలై 14 ప్రభాతవార్త : గుడుపల్లె తహశీల్దార్ కార్యాలయంలో ఓ విఆర్ఏ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం వెలుగు చూసింది. ఈసంఘటనకు సంబంధించి అధికారులు తెలిపిన మేరకు వివరాలిలా.. మండలంలోని కోటమాకనపల్లికి చెందిన గోవిందప్ప (72) మండలంలోని ఒఎన్ కొత్తూరు గ్రామ రెవెన్యూ సహాయకుడిగా పనిచేస్తున్నాడు. ఇతను ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తున్నాడు. గతంలో వివాహం చేసుకున్న ఇద్దరు భార్యలు అతన్ని వదిలిపెట్టి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో గోవిందప్ప మద్యంకు బానిసఅయ్యాడు. గురువారం రాత్రి తహశీల్దార్ కార్యాలయంలో కాపలా ఉండేందుకు వచ్చిన గోవిందప్ప గది తలుపులు లోపలినుంచి వేసుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. శుక్రవారం ఉదయం సిబ్బంది గోవిందప్ప ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పంచనామాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్య చేసుకున్న విఆర్ఏ గోవిందప్ప

## రేపు ఉచిత మెగా కంటివైద్య శిబిరం

కుప్పంరూరల్, జూలై 14 ప్రభాతవార్త

సాయిమాతా సేవా ట్రస్ట్, తిరుపతి అరవింద్ కంటి ఆస్పత్రిచే ఈనెల 16న కుప్పం బాలుర హైస్కూల్‌లో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకులు జగదీష్‌బాబు తెలిపారు. కంటి జబ్బులతో బాధపడేవారు ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 9391833999 నెంబరును సంప్రదించాలని కోరారు.

## గిరిజనుల సమస్యలపై ఎస్టీ కమీషన్ సభ్యులకు వినతి

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త :



గిరిజనుల సమస్యలపై ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్‌ను ఆలిండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రవినాయక్ వినతిపత్రం అందించారు. కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్టీల జాబితాలో వాల్మీకి, బోయలను చేర్చేందుకు ప్రభుత్వం తెచ్చిన జిఓ నెం 52ను వెంటనే రద్దు చేసేలా చూడాల న్నారు. కుప్పంలో గిరిజన కమ్యూనిటీ భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## పరమహంసలో కుక్ ఫుడ్ వితౌట్ ఫైర్ కార్యక్రమం



శాంతిపురం, జూలై 14 ప్రభాతవార్త :

స్థానిక పరమహంస యోగానంద విద్యాలయంలో కెజి విద్యార్థులకు కుక్ ఫుడ్ వితౌట్ ఫైర్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల కూరగాయలు, బ్రెడ్, జామ్, క్యారెట్, ఉల్లి తదితరాలతో వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కరస్పాండెంట్ రాధాకృష్ణన్, ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్, ఉపాధ్యాయులు నళిని, భానుప్రియ, షబ్రీన్, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారంకే జగనన్న సురక్ష

కుప్పంరూరల్, జూలై 14 ప్రభాతవార్త :



ప్రజా సమస్యల పరిష్కారంకే ప్రభుత్వం జగ నన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం మోడల్ కాలనీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మోహన్‌రాం ,సోమశేఖర్, విజయ్, మైనార్టీ అధ్యక్షుడు సర్దార్, మోహన్, జతిన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుదేశంను నాశనం చేయడమే లక్ష్యంగా పవన్ విధులు : ఎంపీ రెడ్డప్ప

చిత్తూరు, జూలై 14 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీని నాశనం చేయడమే లక్ష్యంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటన వుంటోందని చిత్తూరు ఎంపీ రెడ్డప్ప ధ్వజమెత్తారు. చిత్తూరులో శుక్రవారం ఎంపీ రెడ్డప్ప విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు పవన్ కళ్యాణ్ దత్తపుత్రుడని, ఏజెంట్ అని ఆయన విమర్శించారు. పవన్‌కళ్యాణ్ ముఖ్యంత్రి కావడానికి రాజకీయాల్లోకి రాలేదని, చంద్రబాబు నాయుడును రాజకీయంగా నాశనం చేయడానికి మాత్రమే రాజకీయాల్లో వచ్చినట్లు తెలుస్తోందన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడితే రాజకీయ నాయకుల విలువలు పోతాయన్నారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థి భరత్ ఎమ్మెల్యేగా గెలిస్తారని ఆయన జోస్యం చెప్పారు.

## తక్కువ ధరకు బియ్యం విక్రయాలు

- కేజీ సోనామసూరీ ధర రూ.44.50
- జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు

చిత్తూరు, జూలై 14 ప్రభాతవార్త:

బియ్యం ధరల నియంత్రణ చర్యల్లో భాగంగా మార్కెట్ యార్డులు, రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తక్కువ ధరకే సోనామసూరి రకం బియ్యం విక్రయాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు బియ్యం వర్తకుల అసోసియేషన్ నాయకులతో పేర్కొన్నారు. జెసి పి.శ్రీనివాసులు తన ఛాంబర్‌లో శుక్రవారం మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వరన్, డిఎస్ఓ శంకరన్, సివిల్ సప్లైయిస్ డిఎం మోహన్‌బాబు, బియ్యం వర్తలకు అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ జిల్లాలో 60 నుండి 70 కౌంటర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన సోనామసూరి ఒక కేజీ బియ్యం రూ.44.50కు విక్రయించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బియ్యం విక్రయాల కోసం జిల్లాలోని పది మార్కెట్ యార్డులతో పాటు చిత్తూరు రైతు బజారు, ప్రతి మండలంలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని జెసి శ్రీనివాసులు స్పష్టం చేశారు.

## అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు అందించాలి

- రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త :



అర్హులైన గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ది కలిగించాలని రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం రామకుప్పం మండలం వీర్నమల, పెద్ద తాండా పంచాయతీల్లో ఆయన పర్యటించారు. గిరిజనుల అభివృద్ధికి అమలవుతున్న సంక్షేమ పథకాల తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీకి మారుపేరు, మోసం చేయడం తెలియని వారు గిరిజనులు అన్నారు. అటవీ, ప్రభుత్వ భూముల్లో గిరిజనులు ఇళ్లు కట్టుకున్నా వ్యవసాయం చేసుకుంటున్న వారి అనుభవంలో ఉన్న భూమిపై గిరిజనులకు పూర్తి హక్కు ఉంటుందన్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గిరిజనులకు కొన్ని లక్షల ఎకరాల భూమికి పట్టాలు అందించారన్నారు. తనతండ్రిని ఆదర్శంగా తీసుకుని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సైతం అర్హులైన గిరిజనులకు భూ పంపిణీ చేస్తున్నారన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. గిరిజనులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలనేది సిఎం ముఖ్య ఉద్దేశమన్నారు. గిరిజన పిల్లలు అందరూ బాగా చదువుకోవాలన్న ఉద్దేశంతో అమ్మఒడి, జగనన్న వసతి,విద్యా దీవెన తదితర పథకాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. గిరిజనుల హక్కులను కాపాడుతూ అధికారులు గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ మురళి, ఎంపిడిఒ రాధాకృష్ణ, జిల్లా గిరిజున సంక్షేమ అధికారి మూర్తి, సర్పంచ్ మోహన్ నాయక్, ఎంపిటిసి రవినాయక్, భాస్కర్ నాయక్, చిన్నరాజు నాయక్, గిరిజన నేతలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు

కుప్పంరూరల్/శాంతిపురం, జూలై 14 ప్రభాతవార్త

కుప్పం,శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ మినీ కార్యకర్తలు, హెల్పర్‌పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ అరుణశ్రీ కోరారు.కుప్పం మండలంలోని అడవిబూదుగూరు, రాగిమానుమిట్ట గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు, శాంతిపురం మండలంలో డిటి పల్లి, శ్యామరాజపురంలో మినీ కార్యకర్తలు, శాంతిపురం మండలం శివకురుబూరు, రామకుప్పం మండలం కెంపసముద్రంలో హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 22వతేది లోగా దరఖాస్తులు చేసుకోవాలని సిడిపిఓ అరుణశ్రీ పేర్కొన్నారు. పదవ తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు కుప్పం ఐసిడిఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## 310 మామిడి చెట్లు నరికివేత

యర్రావారిపాలెం,జూలై14 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా ఎర్రావారిపాలెం మండలం ఎల్లమంద గ్రామం బుగ్గలవారిపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య అనే రైతు 5 ఎకరాల్లో నాటిన 310 మామిడి మొక్కలను కొందరు వ్యక్తులు నరికివేసినట్లు చెన్న య్య కుమారుడు మల్లీశ్వర ఎర్రవారిపాలెం పోలీసు లకు పిర్యాదు చేశారు.ఈపొలం పైన గతంలో కూడా వడ్డిపల్లెకు చెందిన కొందరు పీలేరు కోర్టులో కేసు వేసి తమకు చెందినదని చెబుతున్నారని ఆయన చెప్పాడు. గత 40 ఏళ్లగా తాము సాగు చేస్తుంటే తహశీ ల్దారు కూడా తమకు డీ నమూనా పట్టా ఇచ్చారన్నారు. అదేవిధంగా పట్టాదారు పాసుపుస్తకం కూడా వచ్చిందని దానిపై తమకు ప్రభుత్వం నుంచి వస్తున్న సంక్షేమ పథకాల లబ్ది అందుతోందన్నారు. అటు వంటిభూమిని దౌర్జన్యంగా లాక్కోవాలని చూస్తున్నారని అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

## అభివృద్ధి చేసి ఉంటే ఆదరించండి

రొంపిచెర్ల,జూలై14 ప్రభాతవార్త :



తమ గ్రామాల్లో అభివృద్ధి చేసి ఉంటే చూసి ఆదరించండని సర్పంచి ఇబ్రహీంఖాన్ అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల-2 సచివాల యంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్ర మంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ రొంపిచెర్లలో కోట్ల రూపా యల అభివృద్ధి జరిగిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో తాము అభివృద్ధి కార్యక్రమాలు చేశామ న్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాధరెడ్డి వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, ఎంపీడీఓ రాజేంద్ర, తహశీల్దారు అమరనాథ్, ఎంపీటీసీలు సిరాజున్నీసా, రహీమాబీ, వైకాపా నాయకులు కరీముల్లా, చిన్ననాగరాజ, లక్ష్మయ్య,నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు పాల్గొన్నారు.

## గణనాధుని సేవలో సినీ హీరో సాయి ధరమ్‌తేజ్

కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:



ప్రముఖ సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ శుక్రవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు బాబు, సురేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

## వరసిద్దుని దర్శించుకున్న ఉత్తరప్రదేశ్ మంత్రి

కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:



ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి కెపీ.మాలిక్ కుటుంబసమేతంగా శుక్రవారం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

---

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సీఎం సభను విజయవంతం చేయండి

- ఎమ్మెల్సీ రఘురాం



**వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త:** ఈ నెల 21వ తేది సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి వస్తున్న సందర్భంగా ఆయన పర్యటన ఏర్పాట్లను వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ తులసి రఘురాం ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతంపై అధికారులతో వైసీపీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘురాం చర్చించారు. వైయస్ నేతన్న నేస్తం నగదును చేనేత కార్మికుల ఖాతాల్లో జమ చేసేందుకు ఆయన వెంకటగిరి వస్తున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాల వద్ద హెలికాప్టర్ దిగే ప్రదేశాన్ని, వల్లివేడు కూడలి వద్ద ఉన్న బహిరంగ సభను నిర్వహించేందును స్థలాన్ని పరిశీలించారు. విశ్వోదయ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణాన్ని కూడా బహిరంగసభకు పరిశీలించారు. అనువైన స్థలాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని కూడా సీఎం ఆవిష్కరించనున్నారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్‌కుమార్, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కావెంకటేశ్వరరావు,తహసీల్దారుపద్మావతి,ఎంపీడీవోవిజయలక్ష్మీ తదితరశాఖలఅధికారులు పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

- కౌన్సిలర్ శంకరయ్య



**వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త:** మాజీ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్యకు 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య వినతిపత్రం అందజేశారు. మీసేవ కేంద్రం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలో విగ్రహం ఏర్పాటు చేస్తానని అనుమతి ఇవ్వాలని కోరారు. బాబు జగ్జీవన్‌రామ్ బడుగు వర్గాల ఆశాజ్యోతి అని అందరికీ గుర్తింపుగా ఉండేందుకు ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. వెంకటగిరిలో ప్రజలందరూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదం తెలిపేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## రైతులు చిరుధాన్యాల పంట సాగుపై దృష్టి సారించాలి

- ఏడీఏ నాగార్జునసాగర్



**వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త:** రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై మక్కువ చూపాలని ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. ఏడీఏ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రాగులు, సజ్జలు, కొర్రలు వంటి పంటలు సాగు చేయాలని తెలిపారు. మిల్లెట్ పంటలకు మంచి గిరాకీ ఉందని తెలిపారు. రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సుజాత మాట్లాడుతూ రైతులు అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. యాంత్రీకరణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉద్యానవన శాఖాధికారి ఆనందరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయండి



- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

**వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త:** ఈ నెల 21వ తేది సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి వస్తున్న సందర్భంగా ఆయనకు అందరం ఘనస్వాగతం పలకాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో వెంకటగిరి డక్కిలి, బాలాయపల్లి మండలాల నాయకులతో సీఎం సభ విషయమై సమావేశం నిర్వహించారు. నాలుగు సంవత్సరాల పాటు వెంకటగిరి ఎంతగానో వెనుకబడిందని, సీఎం వస్తున్నందు వలన ఆయన అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని తెలిపారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం నగదును సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి నుండి బటన్ నొక్కి కార్మికుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సభను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, వైస్‌చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, వైసీపీ నాయకులు కోటేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి,నాగయ్య,కౌన్సిలర్‌వహీదా,సుబ్బారావు, సురేష్‌రెడ్డి, పూజారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఇస్రోకి మూడొచ్చింది

- చంద్రయాన్-3 ప్రయోగంలో అంతా మూడు సంఖ్యే

**శ్రీహరికోట (తడ), జూలై 14 ప్రభాతవార్త**

శ్రీహరికోట నుంచి శుక్రవారం ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన చంద్రయాన్-3 ప్రయోగంలో ఈ సారి మూడు సంఖ్యకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ ఉపగ్రహం పేరే చంద్రయాన్-3. ఇందులో ల్యాండర్, రోవర్‌తో పాటు ప్రొపల్షన్ మాడ్యూల్ అనే మూడు అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిండిన పరికరాలను పంపించారు. దీనికి తోడు మన రాకెట్ పేరు కూడా ఎల్‌వీఎం3 అని వేరే చెప్పక్కర్లేదు. చంద్రయాన్ ప్రయోగాలు మొదలుపెట్టిన తర్వాత మూడు ప్రయోగాలకు ముగ్గురు ప్రముఖులు ఛైర్మన్లుగా వ్యవహరించారు. మొదటి ప్రయోగానికి జి.మాధవన్ నాయక్, చంద్రయాన్-2కు కె.శివన్, ప్రస్తుతం ముచ్చటగా మూడవ ప్రయోగానికి ఎస్.సోమనాథ్‌లుగా ఇస్రో ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. మూడు చంద్రయాన్ ప్రయోగాలు చేపట్టిన రాకెట్లు మూడు పేర్లతో రూపొందించడం మరో విశేషం. తొలి ప్రయోగం పిఎస్ఎల్‌వి సి-11 పేరుతో రూపొందించిన రాకెట్ ద్వారా జరిగింది. రెండవ చంద్రయాన్ జిఎస్ఎల్‌వి మార్క్3 పేరుతో రూపొందించిన రాకెట్ ద్వారా జరిగింది. మూడవ ప్రయోగం ఎల్‌వీఎం3-ఎం4 పేరుతో రాకెట్‌ను నిర్మించి శుక్రవారం గగన తలానికి గురిపెట్టి వదిలారు. ఇదిలావుంటే చంద్రయాన్-3 ప్రయోగంలో మూడు కీలక పరిశోధనలు ఉన్నాయి. అందులో ఒకటి ఉపగ్రహం ప్రస్తుతం అంతరిక్షంలోని భూకక్ష్యలో పరిభ్రమిస్తోంది. రెండవది చంద్రుని కక్ష్యలో ప్రవేశించి కొన్నిరోజుల పాటు జాబిల్లి చుట్టూ తిరగాల్సి ఉంది. మూడోది చంద్రునిపై దిగే ల్యాండర్, రోవర్‌లు చంద్రునిపై తిరుగుతూ పరిశోధనలు చేయాల్సి ఉంది. ఈ విధంగా చంద్రయాన్-3 పేరుకు తగ్గట్లే మూడు సంఖ్య ఈ సారి ప్రాధాన్యతను కలిగి ఉంది.

## జగనన్న పాలనలో ప్రతి రోజు పండగే : ఎమ్మెల్యే

కోట, జూలై 14 ప్రభాతవార్త :



జగన్నన పాలనలో ప్రతి రోజు పండగేనని గూడూరు శాసన సభ్యులు డా.వెలగపల్లి వర ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం కోట మండలం వెంకన్నపాళెం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హత ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోతే అటువంటి వారు దరఖాస్తులు చేసుకుంటే వారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పద్మావతి, మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, వలిపి శ్రీనివాసులు,మల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల బస్సుకు తప్పిన పెనుప్రమాదం

-నియమనిభందనలు కాగితాలకే పరిమితమా...? -ఫిట్‌నెస్ లేని డ్రైవర్లు,వాహనాలతో చలగాటాలు



గంగవరం,జూలై 14,ప్రభాతవార్త:

విద్యార్థులను తరలించే ఓ కళాశాల బస్సుకు శుక్రవారం పెనుప్రమాదం తప్పింది.మండలంలోని శ్రీచైతన్య కళాశాల బస్సు విద్యార్థులను కళాశాల నుండి తీసుకువెళుతున్న క్రమంలో పలమనేరు నుండి శంకరాయల పేట రహదారిపై వెళుతుండగా బస్సు డ్రైవర్‌కు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కొంగోళ్ళపల్లె సమీపంలోని ఓ 11కేవి విద్యుత్ స్తంభాని ఢీ కొంది.ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగి బస్సుపై పడడం,విద్యాత్ తీగలు బస్సులోకి చొచుకోవడం జరిగింది.అప్పటికే విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ సరఫరా అగిపోవడంతో పెనుప్రమాదం తప్పింది.బస్సులో పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో విద్యార్థులు బస్సునుండి బయటకు రాలేక కేకలు వేయడంతో స్థానికులు ప్రమాదాని గుర్తించి బస్సు నుండి విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకురావడం జరిగింది.ప్రమాద విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.మండలంలోని కళాశాలల నిర్వహకులు కాలం చెల్లిన వాహనాలు,వయసుమల్లిన డ్రైవర్లతో విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడుతున్నారు.గతంలోను మండలంలోని క్రిషారెడ్డి చైతన్య పాఠశాల బస్సు పలమనేరు మదనపల్లె జాతీయ రహదారి పెద్దపంజాణి మండలంలోని బెరపల్లె వద్ద పరిమితికి మించి పిల్లలను తరలిస్తు అతివేగంతో ఎదురుగా వస్తున్న టిప్పర్‌ని ఢీ కొంది.ఆ ప్రమాదంలో పిల్లలకు తీవ్రగాయాలైన సంఘటన విదితమే.ప్రమాదానికి గురైన కళాశాల బస్సు పరిమితికి మించి విద్యార్థులను స్థానిక రవాణా కార్యాలయం వైపు నుండే వెళ్లడం గమనార్హం.తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతునప్పటికి కళాశాల నిర్వహకులు మాత్రం విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసి బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తరలిస్తునప్పటికి అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన విమర్శలు లేకపోలేదు.ఇప్పటికైన సమందిత అధికారులు స్పందించి నిబందనలను కాగితాలకే పరిమితం కాకుండా కాలం చెల్లిన వాహనాలను వినియోగిస్తున్న నిర్వహకులపై కటినమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు,ప్రజలు కోరుకుంటున్నారు.

## శ్రీధర్మరాజుల ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

కుప్పం, జూలై 14 ప్రభాతవార్త :



గుడుపల్లె మండలంలోని యామనూరులో వెలసిన శ్రీ ధర్మరాజ్రుల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబం ధించి శుక్రవారం ఎమ్మెల్సీ భరత్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వేదబ్రహ్మ శ్రీ బాలసుబ్రమ ణ్యశాస్త్రి అధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎంపిపి వరలక్ష్మి, రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత, కుప్పం మండల కన్వీనర్ హెచ్ఎం మురుగేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రజల వద్దకే ఉచిత సేవలు : మున్సిపల్



నగరి, జూలై 14 ప్రభాతవార్త:
రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు విలువైన సేవలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని మున్సిపల్ చైర్మన్ నీలమేఘం అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధి క్తొతపేట ఎన్‌టీఆర్ నగర్ సచివాలయ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష క్యాంప్‌లో పాల్గొన్నారు. 11 సర్వీసులకు సంబంధించి 639 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ బాలన్, మున్సిపల్ సచివాలయ కన్వీనర్ దయానిధి, కౌన్సిలర్ భూపాలన్, కో-ఆప్షన్ సభ్యులు ఆనందకుమార్, హమీద్,నాయకులు మనోహర్, ఇళంగో, మున్సిపల్ డీఈ నరేష్, హౌసింగ్ ఏఈ మెప్మా అధికారి సునీత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## శ్రీసిటీ జపాన్ పరిశ్రమలచే...

ప్రభుత్వ హైస్కూళ్ళకు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డుల వితరణ

సత్యవేడు, జూలై 14 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన అధునా తన విద్యను అందించే ప్రయత్నంలో తమ కార్పోరేట్ సామాజిక భాద్యతలో భాగంగా శ్రీసిటీ జపనీస్ కంపెనీస్ అసోషియేషన్ శ్రీసిటీ పరిసరాల్లోని ఇరుగుళం, మాదనపాళ్యెం జడ్పీ హైస్కూళ్ళకు ఒక్కోటి చొప్పున 2.4 లక్షల రూపాయల వ్యయంతో రెండు స్మార్ట్ డిస్‌ప్లే బోర్డ్‌లను వితరణగా ఇచ్చింది. పాఠశాలల ఆవరణలో శుక్రువారం నిర్వహించిన జపనీస్ పరిశ్రమల అసోషియేషన్ చైర్మేన్ అకిరా మత్సుత ఆయా స్కూళ్ళ ప్రధానోపాధ్యాయులకు లాంఛనంగా అందజేశారు. ఈకార్యక్రమంలో కికువా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ కొబాయాసి, పలువురు జపానీస్ పరిశ్రమల ప్రతినిధులు, శ్రీసిటీ కస్టమర్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌లు పాల్గోన్నారు.

## సీఎం సభను విజయవంతం చేయండి

– వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, జులై 14, ప్రభాతవార్త:



ఈ నెల 21వ తేది సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి వస్తున్న సందర్భంగా ఆయనకు అందరం ఘనస్వాగతం పలకాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో వెంకటగిరి డక్కిలి, బాలాయపల్లి మండలాల నాయకులతో సీఎం సభ విషయమై సమావేశం నిర్వహించారు. నాలుగు సంవత్సరాల పాటు వెంకటగిరి ఎంతగానో వెనుకబడిందని, సీఎం వస్తున్నందు వలన ఆయన అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని తెలిపారు. చేనేత కార్మికులకు నేతన్న నేస్తం నగదును సీఎం జగన్మోహన్‌రెడ్డి వెంకటగిరి నుండి బటన్ నొక్కి కార్మికుల ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి సభను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద, చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, వైస్‌చైర్మన్ బాలయ్య, ఉమామహేశ్వరి, వైసీపీ నాయకులు కోటేశ్వరరావు, ప్రసాద్‌రెడ్డి, నాగయ్య, కౌన్సిలర్ వహీదా, సుబ్బారావు, సురేష్‌రెడ్డి, పూజారి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రయాన్ 3 విజయవంతంతో ప్రత్యేక పూజలు

తిరుపతి,జులై 14 ప్రభాతవార్త:





చంద్రమండలంలో దక్షిణధృవంలో పరిశోధనలకు ఇస్రో శాస్త్రవేత్తలు శ్రీహరికోట నుంచి శుక్రవారం ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో తిరుపతిలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలుచేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ ఆలయంలో ఇస్రో చంద్రయాన్ 3 చిత్రపటం ఉంచి బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, చంద్రారెడ్డి, జగదీశ్వరనా యుడు, డాక్టర్ శ్రీహరిరావు, డాక్టర్ నరేశ్‌బాబు, కె.చెంగారెడ్డి, కెఎన్ రాజా, అక్కిపల్లి ముని కృష్ణయ్యయాదవ్, జేజిరఎడ్డి, కవిత తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. చంద్రయాన్ 3 విజయవంతం కోరుతూ గంగమ్మకు ప్రార్థనలు చేశారు.

## సమర్ధవంతంగా రీ సర్వే

జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ

రామచంద్రాపురం, 14 ప్రభాతవార్త:
జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రెవెన్యూ అధికారులు చేపడుతున్న భూముల రీ సర్వేను



సమర్ధవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆర్థో రిఫ్లెక్టెడ్ ఇమేజస్ అందించిన వెంటనే రైతుల భూములు రీ సర్వే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు తమ పట్టాదారు పాస్ పుస్తపుకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, ఫోటో, కులం, ఫోన్ నంబర్లు అందించాలని అన్నారు. రెవెన్యూ అధికారులు రైతుల పొలాల వద్దకు చేరుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమగ్ర సర్వే నిర్వహించి సరికొత్త భూ హక్కు పత్ర ం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ కృష్ణమ్మ, సర్వేయర్ హేమకుమార్, విలేజ్ సర్వేయర్లు, విఆర్ఓ సతీష్‌కుమార్, ప్రసాద్, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, నాగజ్యోతి, విలేజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన మహిళ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ భారతి

తిరుపతి (విద్య), జులై 14, ప్రభాతవార్త :



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పదవీ బాధ్య తలను స్వీకరించిన ఆచార్య డి. భారతి గురువారం విజయవా డలోని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. తన పై నమ్మకంతో ఉపకులపతిగా బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.
ఫోటో రైటప్

## ఎంబిఏ ఫలితాల్లో ఎడ్జ్ ఇంటర్నేషనల్ బీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విద్య), జులై 14 ప్రభాతవార్త :



2022-23 విద్యా సంవత్సరానికి శ్రీ వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఎంబీఏ కోర్సు 3వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక బంగారుపాళ్యెంలోని ఎడ్జ్ ఇంటర్నేషనల్ బీ స్కూల్ నందు చదువుతున్న విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని, కళాశాల డైరెక్టర్ జి. భాస్కర రెడ్డి తెలియజేసారు. వీరిలో లహరి, పల్లవి, విశ్వచందన్ రెడ్డి, మౌలిష్ రెడ్డిలు ఉత్తమ ఫలితాలతో మెరిశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డైరెక్టర్ జి.భాస్కరరెడ్డి, ప్రిన్సిపాల్ వై.సతీష్ కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## బయో మిథనైజేషన్ గ్యాస్ ఉత్పత్తిని పెంచండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, జులై 14 ప్రభాతవార్త :



బయో మిథనైజేషన్ గ్యాస్ ఉత్పత్తిని పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా 25 ఎంఎల్‌డి మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తూకివాకం దగ్గరున్న మహేంద్ర బయో మిథనైజేషన్ ప్లాంట్‌ను శుక్రవారం పరిశీలిస్తూ పబ్లిక్, ప్రైవేట్ పార్టన్ గ్యాస్ ఉత్పత్తికి ఇకపై ప్రతి రోజు 50 టన్నుల ఆహార వ్యర్థాలను, మార్కెట్ వ్యర్థలను సేకరించి ప్లాంట్‌కి తరలించాలన్నారు. తిరుపతి నగరంలోని ప్రతి ఒక్క చిన్న పెద్ద హోటల్‌ల నుండి మిగిలిపోయిన ఆహారాన్ని తనీగా సేకరించాలని, అదే విధంగా పెద్ద మార్కెట్, చిన్న మార్కెట్, రైతు బజార్ల నుండి పాడైపోయిన కూరగాయలను, పండ్లను సేకరించి బయో ప్లాంట్‌కి తరలించి సిఎన్‌జి గ్యాస్ ఉత్పత్తికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మహేంద్ర ప్రతినిధులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో చెవిరెడ్డి విఫలం



-అవకాశం ఇవ్వండి... అభివృద్ధి చేసి చూపెడతాం..!

-టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, జూలై 14 ప్రభాతవార్త:
నియోజకవర్గ కేంద్రంలోని ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి విఫలమైనట్లు టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి దుయ్యబట్టారు. చంద్రగిరి పాతపేటలో శుక్రవారం ఇంటింటికీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక సమస్యలను లక్ష్యం చేసుకుని ప్రజల ఇబ్బందులను ఆరా తీశారు. దీంతో స్థానికులు డ్రైనేజీ, రోడ్ల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా అర్హులైన వారికి పించన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదన్నారు. చెవిరెడ్డికి రెండు పర్యాయాలు అవకాశం ఇచ్చారు. పులివర్తి నానికి అవకాశం ఇవ్వండి అభివృద్ధి చూపెడతామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సింగు సుధ, కొండూరు ప్రవీణ్ రాయల్, వీరంగారి రమేష్ రెడ్డి, కాపువీధి సునీల్, రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, గౌస్‌భాషా, లంకెళ్ళ లలిత, అమ్ములు, గోపి, మండలం లోకేష్ రాయల్, కాపువీధి తులసి, ఆర్.ఎస్.మస్తాన్, వీరంగారి మహేష్ రెడ్డి, నాయుడమ్మ, రేణుక, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకోదండరాముల వారి సేవకు నగదు విరాళాలు చెల్లించండి..!

చంద్రగిరి, జూలై 14 ప్రభాతవార్త:
శ్రీకోదండరాముల వారి సేవకు భక్తుల నుండి నగదు రూపేనా విరాళాలు కోరుతున్నట్లు శుక్రవారం టిటిడి ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా రూ.1000/-లు చెల్లించి మూడేళ్ళ కాలపరిమితితో ఏడాదికి 5 సార్లు అర్చన, హారతి, 250 గ్రాములు ప్రసాద వితరణ వుంటుందని పేర్కొన్నారు. అదేవిధంగా 5 ఏళ్ళ కాలపరిమితతితో రూ.5000/-లు చెల్లించి ఏడాదికి 30 సార్లు అర్చన, హారతి, అర్చకుని ఆశీర్వాదం, 250 గ్రాములు ప్రసాదం అందించబడుతుందని పేర్కొన్నారు. విరాళం అందించే సమయంలో స్వామివారి ఉత్తరీయం అందించబడుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా 10 ఏళ్ళ కాలపరిమితితో రూ.10 వేలు చెల్లించిన వారికి దాతకు నిత్య అర్చన, ఏడాదికి 30 సార్లు హారతి, అర్చకున ఆశీర్వాదం, 250 గ్రాములు అన్నప్రసాద వితరణ చేయబడుతుందన్నారు. విరాళం అందజేసే సమయంలో పిఎస్ దుప్పటతో సన్మానించడం జరుగుతుందన్నారు.
**-ఉభయదార్ వ్యవస్థ పునరుద్ధణ** శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో ఉభయదార్ వ్యవస్థను పునరుద్ధరించడం ద్వారా మొదట వచ్చిన వారికి మొదటి ప్రాధాన్యం వుంటుందన్నారు. ఆలయంలో జరిగే ఉత్సవాలలో దాతలు కనీస రుసుము రూ.10 వేలు చెల్లించి తగిన ప్రయోజనాలు పొందవచ్చున్నారు. అదేవిధంగా స్వామివారికి నిత్య కైంకర్యాలలో వినియోగించేందుకు పూజా సామగ్రిని అందజేసి రసీదు పొందవచ్చున్నారు. మరిన్ని వివరాలకు ఆలయ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

## కళియంబాకంలో జగనన్న సురక్ష గ్రామ సభ

విజయపురం, జూలై 14 ప్రభాతవార్త :



మండలంలోని కళియంబాకం సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందించారు. రేషన్ కార్డులో మార్పులు చేసుకున్న వారికి కార్డులు పంపిణీ చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రసాద్, తహశీల్దారు వెంకట్రాయలు, ఎఒ రజనీకుమారి, మండల ఆర్బికె చైర్మన్ గుణశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రాజగోపాల్, సర్పంచ్‌లు మమతా శ్రీరాములురెడ్డి, విద్యా భాస్కర్‌రెడ్డి, నాయకులు గోపి, ఎఇలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయపురం, జూలై 14 ప్రభాతవార్త :
ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఎఇ చంద్రబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రయోగం విజయం కోసం కొబ్బరికాయలు కొట్టిన జెన్ అకాడమి

తిరుపతి క్రీడ, జులై 14 ప్రభాతవార్త :



తిరుపతిలోని అలిపిరి కలియుగదైవం వెంకటేశ్వర స్వామి పాదాల చెంత 108 కొబ్బరి కాయల కొట్టి చంద్రయాన్ - 3 ప్రయోగం విజయవంతం కావాలని జెన్ అకాడమి కార్యదర్శి చీనేపల్లి కిరణ్ కుమార్, జూడో కోచ్ గోపి, విజయ్, సురేష్ నాయక్, అచ్యుతనంద, బుజ్జిక్రీడాకారులు ప్రార్థించ దం జరిగింది.

## ఇస్రో బృందానికి శ్రీసిటీ ఎండీ అభినందనలు

సత్యవేడు, జూలై 14 ప్రభాతవార్త:
లాంచ్ వెహికల్ మార్క్-3 ద్వారా చంద్రయాన్-3 విజయవంతంగా భూకక్ష్యలోకి ప్రవేశపెట్టినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరేక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో ఇస్రో చైర్మేన్ ఎస్.సోమనాథ్, సతీస్ థావన్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

## 16న 'లవకుశ' భక్తిరస నాటక ప్రదర్శన

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 14 ప్రభాతవార్త:



ఈనెల 16వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు చంద్రగిరి పట్టణం బస్టాండ్ వద్ద గల క్లాక్ సెంటర్ నందు సుబ్బరాజు నాట్య కళాపరిషత్ తిరుపతి వారి ఆధ్వర్యంలో 'లవకుశ' అనే గొప్ప భక్తిరస నాటక ప్రదర్శన ఉంటుందని సుబ్బరాజు నాట్య కళాపరిషత్ వ్యవస్థాపకుడు కళాతపస్వి కోనేటి సుబ్బరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమం తాలూకు ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చంద్రగిరి ఎమ్మెల్యే,తుడా చైర్మన్ డా॥చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి,విశిష్ట అతిథులుగా చంద్రగిరి పోలీస్‌స్టేషన్ సిఐ పి.రాజశేఖర్‌రెడ్డి, టిటిడి డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ జి.దేవేంద్రబాబు, చంద్రగిరి పినపెద్ద వి.శంకర్‌రెడ్డి,సర్పంచ్ రూపా రామమూర్తి,సరస్వతి విద్యానికేతన్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.జనార్ధన్‌రాజు,రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథ్‌రెడ్డి హాజరవుతారని ఆయన వివరించారు.అద్భుతమైన ప్రతిభా పాటవాలు కలిగిన నటులచే ప్రదర్శించబడే ఈ 'లవకుశ' నాటకాన్ని చంద్రగిరి ప్రజలే కాకుండా పరిసర ప్రాంతాల ప్రజలు సైతం హాజరయ్యి తమ ప్రదర్శన తిలకించి తమను ఆశీర్వదించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఉపాధ్యక్షులు గోపాల్‌రావు, సాంబోలు హరిప్రసాద్ పాల్గొన్నారు.

## బిసిఎం స్కూల్‌లో ఘనంగా 'మామిడి పండు దినోత్సవం'..

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 14 ప్రభాతవార్త:



స్థానిక మంగళంలోని బాలచంద్ర మెమోరియల్ హై స్కూల్(బిసిఎం స్కూల్) నందు శుక్రవారం 'మామిడి పండు దినోత్సవ' వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు అందరూ మామిడి పండు రంగు అయిన పసుపు రంగు దుస్తులు ధరించి వచ్చారు.అలాగే వారు వివిధ రకాల మామిడి పండ్లను తీసుకొచ్చి ప్రదర్శనగా ఉంచడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ మామిడి పండు అనేది అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడిన అత్యంత పోషకమైనదని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు కృష్ణమూర్తినాయుడు,కరస్పాండెంట్ ప్రియ,ప్రిన్సిపాల్ సుకన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

## జగనన్న సురక్ష ప్రతి కుటుంబానికి రక్ష

– ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూలై14 ప్రభాతవార్త:



జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని 'జగనన్న సురక్ష....ప్రతి కుటుంబానికి రక్ష అని చంద్రగిరి వైకాపా అభ్యర్థి, తిరుపతిరూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించే దిశగా ప్రజా సాధికారత లక్ష్యంగా సి.యం. జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. శుక్రవారం చెర్లోపల్లి, లక్ష్మీనగర్ సచివాలయాల్లో 'జగనన్న సురక్ష' శిబిరాలలో ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు. చెర్లోపల్లి గ్రామ పంచాయతీలో 443 సర్టిఫికేట్స్, లక్ష్మీనగర్‌లో 211 సర్టిఫికేట్స్‌ను అందజేసారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి గ్రామ సర్పంచ్ సుభాషిణి, వైకాపా నాయకులు శుభగిరి, అధికారులు పాల్గొన్నారు.

## చేసిన మేలు చెబుతూ...చేయాల్సిన పనులు తెలుసుకొంటూ

–గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మి ఆత్మీయ పలకరింపు

తిరుపతిరూరల్, జూలై14 ప్రభాతవార్త:



చేసిన మేలును చెబుతూ .... చేయాల్సిన పనులు గురించి తెలుసుకొంటూ... ప్రతి గడపలో ఆత్మీయతను పంచుతూ చెవిరెడ్డి లక్ష్మి చేపట్టిన పాదయాత్రకు అపూర్వ ఆదరణ లభిస్తోంది. కరోనా కష్టకాలంలో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను కంటికి రెప్పలా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కాపాడుకున్నారని గుర్తు చేసారు. తిరుమల నగర్ పంచాయతీలో మూడోవరోజు జరిగిన గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా తుడా క్వాటర్స్, కెబిఆర్ నగర్, రామచంద్రానగర్, గంగాదేవి ఎస్టీ కాలనీల్లో చెవిరెడ్డి లక్ష్మి పర్యటించారు. స్థానిక ప్రజలతో మమేకమై అక్కడి సమస్యలు తెలుసుకొంటూ జగనన్న ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని, ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ తన బిడ్డను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేసారు.

## నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం

నగరి, జూలై 14 ప్రభాతవార్త:
భారతదేశంలో ఉత్పత్తి రంగం మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేణుగోపాల్ తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రశాయన శాస్త్రం విభాగం మెడికల్ డెవిస్ ప్రొడక్ట్ క్వాలిటీ అనే అంశంపై ఏర్పాటు చేసిన అతిథి ఉపన్యాసంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో చైనా వంటి దేశాలు అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణమని ఉత్పత్తి రంగంలో అనూహ్యమైన ప్రగతిని సాధించడమే ప్రధాన కారమణమని తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీ బడిగ డైరెక్టర్ ఆఫ్ క్వాలిటీ, అబ్బోట్ దయాగ్నోస్టిక్స్, అమెరికాకు చెందిన డాక్టర్ అరుణ మాట్లాడుతూ కోవిడ్-19 సమయంలో తమ కంపెనీ తయారు చేసిన సేఫ్టీ డివైసెస్ ఎంతగానో ప్రజలకు ఉపయోగపడిందని తెలియజేశారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగం ఇన్‌చార్జి డా. ఇందిరా ప్రియదర్శిని,డాక్టర్‌నరసయ్య, మునికుమారి, శివలక్ష్మి, లాల్ బాషా, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గాజుల అలంకరణలో శ్రీ వాసవీదేవి

పుత్తూరురూరల్, జూలై 14 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం బాజరు వీధిలోవెలసిన శ్రీ వాసవీ కనికాపరమేశ్వరి అమ్మవారిని ఆషాడ మాసం సందర్భంగా గాజుల అలంకరణలోసుందరంగా అలంకరించారు. అమ్మవారు భక్తులకు గాజుల అలంకరణలో దర్శనభాగ్యాన్ని కల్పించారు. ఉదయం ఆలయంలో అభిషేకాలు, అలంకరణలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఓలేటి మహేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం

రేణిగుంట, జూలై 14 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, కేంద్ర సాంస్కృతిక శాఖ సాహిత్య అకాడమి కార్యదర్శి శ్రీనివాసరావు, లైజన్ ఆఫీసర్ భాస్కర్‌నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, ఎయిర్‌పోర్టు సీఎస్‌వో రాజశేఖర్, తదితరులు స్వాగతం పలికారు.

## రేణిగుంట నుంచి ఇడుపులపాయకు

రేణిగుంట, జూలై 14 ప్రభాతవార్త:



రేణిగుంట బాలికల ప్లస్ టు ఉన్నత పాఠశాలలో ఇంటర్ పూర్తి చేసుకున్న సుప్రియ, చందనలు ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీకి ఎంపికయ్యారు. సుప్రియ 567, చందన 543 మార్కులతో ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీలో అడ్మిషన్లు సాధించారు. వీరిని పాఠశాల ప్రధానాచార్యులు విష్ణువర్ధిని, బోధన బోధనేతర సిబ్బంది, పూర్వ విద్యార్థుల సంఘం నేతలు, పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

**CHANGE OF NAME**
I,GALISUDHAKAR (OLD NAME) R/at D.No. 43/2, 2ND FLOOR, NEW BALAJI COLONY, TIRUPATI Dist, A.P.,I have changed my name to GALI SUDHAKAR NAIDU S/O GALI RAMESH (NEW NAME)

**CHANGE OF NAME**
I,PUTTUR MEENA W/O NESANOORU HARESH (OLD NAME) R/at DAMARAKUPPAM (V) VEDURU KUPPAM) (M) CHITTOOR Dist,A.P.,I have changed my name to NESANURU MEENA W/O NESANURU HAREESH REDDY( NEW NAME)

**CHANGE OF NAME**
I,ITHA VENKAT PRAVEENA (OLD NAME ) R/at DNo.24/253,MULAPETA,SPSR NELLORE Dist A.P. I have changed my name to THUMMALAPENTA PRAVEEENA W/O THUMMALAPENTA JANAKIRAM ( NEW NAME)

# నిబద్ధతో విధి నిర్వహణ... ఉద్యోగాలు శాశ్వతం కాదు

**శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త :** 'ప్రభుత్వ ఉద్యోగాలు ఎవ్వరికి శాశ్వతం కాదని సర్వీసు నిబంధనల మేరకు రిటైర్డ్ కాక తప్పదని అయితే విధి నిర్వహణలో నిబద్ధత్తో,జవాబుదారి తనంతో పని చేసి ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన ఉద్యోగుల్లో ఎం.వెంకటరెడ్డి ఒకరని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఏర్పేడు మండలం బండారుపల్లి బ్రాంచి పోస్టు మెన్‌గా వెంకటరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా పొన్నాలమ్మ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సన్మానసభకు పట్టణ ప్రముఖులు శాఖ అధికారులు హాజరయ్యారు. వెంకటరెడ్డి అందించిన ఎనలేని సేవలను అభినందించారు.సుమారు 62 సంవత్సరాల వయస్సు వరకు ఆయన బండారుపల్లి చుట్టు గ్రామాలకు తపాలా సేవలందించారని వివరించారు. ఒక నాడు జాబుకు ఎంత ప్రధాన్యత ఉండేదని వివరించారు.ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం లేని రోజుల నుంచి వెంకటరెడ్డి పోస్టు మ్యాన్‌గా తన



సేవలను అందించారు. గ్రామస్థులకు సమాచారం అందించటంలో రేయి పగలు, ఎండా వాన లెక్క చేయక గ్రామస్తులకు వచ్చిన ఉత్తరాలను అందించే వారని అలాగే టెలిగ్రామ్‌లను అందించి సేవను అందించారన్నారు. ఆయన సర్వీసులో ఎన్నడూ ఎలాంటి ఆరోపణలు ఎదుర్కొలేదన్నారు. చిత్తశుద్ధి జవాబుదారి తనంతో ఉద్యోగం నిర్వహించి అందరి మన్ననలను అందుకున్నారన్నారు. పోస్టుమ్యాన్‌గా సేవలందిస్తూ ఆధ్యాత్మిక ధార్మిక వాదిగా గుర్తింపు పొందారన్నారు. ఆయనకు శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆశీస్సులు ఎల్లవేళల్లో ఉంటాయని శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను అంజూరు శ్రీనివాసులు దుశ్శాలువతో సత్కరించి, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. కాగా భార్యభర్తలను సత్కరించారు.అలాగే శాఖాపరంగా కూడా సత్కరించారు.ఈ కార్యక్రమాల్లో ఏర్పేడు మండల మాజీ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, ద స్కూల్ కరస్పాండెంట్ జనార్థన్‌రావు పవార్, మాజీ కాంగ్రెస్ కార్యదర్శి గాజుల సత్యనారాయణ,బొల్లినేని జగ్నాథ నాయుడు, పోస్టల్ శాఖకు చెందిన సబ్‌డివిజనల్ ఇన్సె పెక్టర్ మణికండన్,ఎస్‌పిఎం గోపాలరావు,గ్రూప్ బ్రాంచి కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, ఎఐటిఇయు పోస్టుమ్యాన్ మురళి,జిటిఎస్‌సహాయ కార్యదర్శి ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఏర్పాట్లును పి.దొరస్వామి రెడ్డి, కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

## సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలి : పవిత్రారెడ్డి

**తొట్టంబేడు, జూలై 14 ప్రభాతవార్త :**



అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష' కార్యక్రమంను రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రౌతుసూరమాల సచివాలయ పరిధిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సర్పంచ్ పావని, వైకాపా సీనియర్ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడులు విచ్చేశారు. ఈసందర్భంగా పవిత్రారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం అనే కార్యక్రమం ద్వారా ప్రతి పేదవారు ఎలాంటి సమస్య ఉన్నా అధికారులు చుట్టు తిరగకుండా, అధికారులు నేరుగా ప్రజల వద్దకు వచ్చి వారికి కావాల్సిన సర్టిఫికెట్లను ఎలాంటి రుసుము లేకుండా ఉచితంగా ఇవ్వాలని సిఎం ఆదేశించారని ఇది ఎంతో గొప్ప కార్యక్రమం అని ఇంతవరకు రాష్ట్రంలో ఇలాంటి కార్యక్రమం ఏముఖ్యమంత్రి చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొన్నలిరమేష్, భక్తవత్సలం, రామయ్య, నాగరాజు, వెంకటయ్య, సుధాకర్, కొన్నలిరమేష్, రాజేంద్ర, వెంకటయ్య, రమేష్, సురేష్, మనోజ్,ఎంపిడిఓసురేష్‌బాబు, తహశీల్దార్ సుధీర్‌రెడ్డి, ఇఓపిఆర్‌డి తరుణాక్షరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్‌సెట్‌లో వికసించిన గ్రామీణ కుసుమం : రాష్ట్రస్థాయిలో ర్యాంకు

**తొట్టంబేడు, జూలై 14 ప్రభాతవార్త :**



ఎడ్‌సెట్‌లో గ్రామీణ కుసుమం విరబూసింది. రాష్ట్ర స్థాయిలో మూడోర్యాంకు సాధించిన విద్యార్థిని పలువురు అభినందించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పూడి గ్రామంలో నివాసం ఉంటున్న రైతు కుటుంబానికి చెందిన జె.సుధాకర్‌నాయుడు, లతల పెద్దకుమారుడు జె.భరత్ సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈనేపధ్యంలో ఇటీవల జరిగిన ఎడ్‌సెట్ పరీక్షలకు కూడా హాజరయ్యాడు. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించడంతో పలువురు అభినందించారు. ప్రస్తుతం తాను సివిల్స్‌కు చదువుతున్నానని వివరించారు.ఈసందర్భంగా పలువురు భరత్‌ను అభినందించారు.

## ఘనంగా మాజీ ట్రస్టుబోర్డు సభ్యుని పుట్టినరోజు వేడుకలు

**శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త**



తెలుగుదేశంపార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు మరియు ట్రస్టుబోర్డు మాజీ సభ్యుడు వాకచర్లగురప్పశెట్టి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం ఆయన నివాసంలో తెలుగుదేశంపార్టీ నాయకులు వంకాలయ సిద్దులయ్య, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, మాజీ టౌన్‌బ్యాంకు ఛైర్మన్ డివి.నారాయణ, వైస్ ఛైర్మన్ ఖాదర్‌బాషా, అనిల్, పూలశేఖర్, గణేష్, రాజ, సుబ్రమణ్యం, జీవ,సయ్యద్‌ఖాజా ఆయన్ను దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

## నేడు భవిష్యత్తుకు గ్యారంటీ బస్సుయాత్ర

**శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త**



నేడు రేణిగుంట ఫ్లై ఓవర్ వద్ద నుంచి భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర ప్రారంభం అవుతుందని తెలుగుదేశంపార్టీ శ్రేణులు తెలిపారు. నేటి ఉదయం 9గంటలకు రేణిగుంట ఫ్లైఓవర్ వద్ద నుంచి ప్రారంభమై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహంకు నివాళులు అర్పించిన అనంతరం ఎన్టీఆర్ విగ్రహానిక నివాళులు అర్పించనున్నారు. అనంతరం రేణిగుంటలో అన్యాక్రాంతమైన భూములు పరిశీలన, అనాసంపల్లి భూములు పరిశీలన, గాజులమండ్యం చక్కెరఫ్యాక్టరీ వద్ద రైతులతో సమావేశం, రేణిగుంట ఎయిర్‌పోర్టు వద్ద సెల్కాన్ కళాశాల కంపెనీ సందర్శన, ఏర్పేడు సర్కిల్ వద్ద స్ధానికులతో మాటామంతి, ఐఐటి, ఐసర్, మధ్యాహ్నం 2గంటలకు జంగాలపల్లిలో భోజనవిరామం, 3ః30గంటలకు బస్సుయాత్ర ప్రారంభం, గుంటకిందపల్లిలో చెరువు పరిశీలన, ఊరందూరు వద్ద హౌసింగ్ అక్రమాల పరిశీలన, గ్రామస్తులతో ముఖాముఖి అనంతరం ఎపిసీడ్స్ వద్ద రైతులతో సమావేశం, స్కిట్ కళాశాల సందర్శన, బిపి అగ్రహారం, పెండ్లిమండపం, శ్రీకాళహస్తిలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం తొట్టంబేడు గ్రామంలో రచ్చబండ, పల్లెనిద్ర ఉంటుందని, అక్కడి నుంచి 16వ తేదీ ఉదయం సత్యవేడు నియోజకవర్గంలో రధయాత్ర ఉంటుందన్నారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలిని సత్కరించిన చంద్రప్ప

**శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త**



ప్రధాన మంత్రినరేంద్రమోడీ ప్రభుత్వంలో మహిళా సాధికారతకు మరో నిదర్శనం బిజెపి రాష్ట్రఅధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరిని నియమించడమే అని తిరుపతి బిజెపి జిల్లా అధ్యక్షులు డాక్టర్‌చంద్రప్ప అన్నారు. ఈసందర్భంగా హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛంతో కలసి దుశ్శాలువతో సత్కరించారు.

## శాకంబరీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరిదేవి

**శ్రీకాళహస్తి, జూలై 14 ప్రభాతవార్త**

ఆషాడమాసం సందర్భంగా బజారువీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆషాడమాసం సందర్భంగా చివరి శుక్రవారం సందర్భంగా ఆలయంలో వెలసిన వాసవీకన్యకాపరమేశ్వరిదేవికి వివిధ రకాల కూరగాయాలతో శాకంబరీ అలంకరణ చేశారు. ఈసందర్భంగా శ్రీవాసవి మండలి వారిచే అన్నపూర్ణ స్తోత్రం, ఖడ్గమాల స్తోత్రం,అమ్మవారి భక్తిగీతాలాపాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు వందమంది పైగా మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్ధప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో దేవాలయ పాలకమండలి, వాసవి మహిళా పాలకమండలి, వాసవి సేవకులు మరియు వాసవి యువసేన పాల్గొన్నారు.

## శివయ్య సేవలో సినీనటుడు ధరమ్‌తేజ్

**శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త :**



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్వయంభువుగా వెలసిన వాయులింగేశ్వరుని శుక్రవారం సినీ హిరో సాయిధరమ్‌తేజ దర్శించుకున్నారు.వారికి ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దక్షిణ గోపురం వద్ద వేదపండితులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు రమాప్రభ,లక్ష్మీ ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు పాల్గొన్నారు.ఏర్పాట్లను ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్సె పెక్టర్ సుదర్శనం నాయుడు, పట్టణ ప్రముఖులు కోళ్ళూరు హరినాయుడు, కంఠాఉదయ్‌కుమార్,శ్రీవారిసురేష్, న్యాయవా లక్ష్మీపతి, గరికపాటి చంద్ర,శశి, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షతో గ్రామీణులకు ప్రయోజనం : ఎంపిడిఓ

**శ్రీకాళహస్తిరూరల్,జూలై 14 ప్రభాతవార్త :**



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాలు గ్రామీణుల సమస్యల పరిష్కారానికి చక్కటి వేదికైందని శ్రీకాళహస్తి మండల మండల పరిషత్ అధికారి రఫీఖాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బి.వెంకటాపురం సచివాలయ పరిధిలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా రఫీఖాన్ మాట్లాడుతూ ఇదో మహోన్నత కార్యక్రమం అన్నారు. నెల రోజుల పాటు అధికారులు, పార్టీపర్యవేక్షకులు గ్రామాలకు వెళ్ళి గ్రామీణులు ఏం కోరుకుంటున్నారో తెలుసుకోవటానికి చక్కటి వేదిక అని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజల స్పందన,వ్యతికేతను తెలుసుకొని పరిష్కరించుటకు చక్కటి అవకాశం అని వివరించారు. ప్రతి సచివాలయం పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి వద్దకే సర్టిఫికేట్లు రావటంతో ప్రజలు ఎంతో సంతోష పడుతున్నారని రఫీఖాన్ వివరించారు. 11 రకాల సర్టిఫికేట్లను 876 మంది దరఖాస్తు దారులకు అందించామన్నారు.పైసా ఖర్చు లేకుండా, నిరుపేదలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామంలోనే అందజేయటం ప్రజల పట్ల ప్రభుత్వానికి గల గుర్తింపుకు నిదర్శనం అని వివరించారు.ఈకార్యక్రమాల్లో మండల జెసియస్ కన్వీనర్ నాగూర్‌రెడ్డి, ముఖ్యఅతిధిగా హాజరై నియోజకవర్గంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్ని వర్గాలను ఆకర్షిస్తూ పరిపాలన సాగిస్తున్నారని వివరించారు.గ్రామ సచివాలయ కన్వీనర్లు వి.కిరణ్,వి.హరిబాబు, కె.వెంకటేస్ గృహసారధులు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శి ఢిల్లి కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## 9ఏళ్ళలో సుపరిపాలన అందించిన మోదీ

**శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త :**



9ఏళ్ళ పాటు కేంద్రంలో బిజెపి రథసారధి నరేంద్రమోదీ ప్రజలకు సుపరిపాలన,సంక్షేమ కార్యక్రమాలు అందించారని శుక్రవారం జరిగిన బిజెపి సమావేశంలో నాయకులు వివరించారు. పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు అధ్యక్షతన పట్టణ పార్టీ సమావేశం జరిగింది. సమావేశంలో పట్టణంలో కొన్ని పార్టీ పదవులు ఖాళీగా ఉండటంతో వాటిని భర్తీ చేసారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి కేంద్రం కట్టుబడి పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండేటి గోపాల్, పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్ గోపాల్, ఎం.చెంగల్‌రాయరెడ్డి, తొగూరు వల్లెమ్మ,పగడాల ప్రతాప్, ప్రధాన కార్యదర్శి మద్దు వాసుయాదవ్, పుణ్యం డిల్లికుమార్, కార్యదర్శులు ఇ మోహన్‌రావు కన్నా వెంకటేశ్వర్లు, కలపాటి మోహన్‌రావులు పాల్గొన్నారు.

## ఇస్లాం మానవుని జీవన విధానాన్ని నేర్పుతుంది : రేహాన్

**శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త :**



ఇస్లాం మతం మానవుని సన్మార్గంలో నడిపే దిక్సూచి అని హాఫీజే ఖుర్ అన్ రేహాన్ సాహెబ్ అన్నారు. శుక్రవారం జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్ధనల సందర్భంగా హాజరైన వందలాది మందికి ఇస్లాం గురించి ఇమాన్ గురించి వివరించారు.మానవుని సన్మార్గంలో నడుపుటకు దిశ దెశ నిర్దేశం చేసేది ఇస్లాం మతం అన్నారు. నేడుమనం ఇస్లాం మతంలో ముస్లింలుగా ఉన్నాము తప్ప ఆచార వ్యవహారాలను ఆచరించటం లేదన్నారు.మనం పరమత మోజులో ఇస్లాం మత సిద్దాంతాలకు తిలోదకాలిస్తున్నారన్నారు. ప్రవక్తల కాలంలో కూడా విగ్రహారాధన ఉండేదని ఇబ్రాహీం ఖలీలుల్లా జీవితం ఎన్నో పరీక్షలను ఎదుర్కొని రూపుమాపి మనకు మార్గదర్శకులు అయ్యారన్నారు. దివ్యఖుర్ ఆన్‌లో ముస్లింలు ఆచరించాల్సిన సిద్దాంతాలువిది విధానాలకు సంబంధించి స్పష్టంగా ఉందన్నారు. మన సంతానం గురించి ఆస్తి వ్యవహారాల గురించి మానవ సంబంధాల గురించి ఇలా ప్రతి చిన్న అంశం గురించి ఆచరించాల్సిన విధివిధానాలకు సంబంధించి వివరించారన్నారు. మొదట మన సంప్రదాయ గ్రంధాలను అధ్యయనం చేయాలి. ఆచార వ్యవహారాలను అమలు చేయాలని రేహాన్ పిలుపు నిచ్చారు.

## యాంకర్ శ్రీముఖి రాహుకేతు పూజలు

**శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త :**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాహుకాల సమయంలో యాంకర్ శ్రీముఖి ఆలయంలో ప్రత్యేక రాహుకేతుదోష నివారణ టిక్కెట్లుతో సహస్రలింగేశరుని సన్నిధి వద్ద వేదపండితులచే పూజలు జరిపించారు. ఆమెకు పూజల ఏర్పాట్లును మాజీ స్కిట్ బోర్డు సభ్యుడు లోకేష్ యాదవ్,ప్రస్తుత ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండులు పర్యవేక్షించారు.

## అంజలికి సత్కారం

**శ్రీకాళహస్తి,జూలై 14 ప్రభాతవార్త :**



ఇటీవల నిర్వహించిన ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో కార్పొరేట్ పాఠశాల రత్నం విద్యార్థి అంజలి తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించి పాఠశాల పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసిందని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. అంజలి శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకులుగా పని చేస్తున్న నిరంజన్ గురుకుల్ కుమార్తె.ఆమె ఆది నుంచి చదువుల్లో రాణిస్తున్నారు.

## నాలుగేళ్లలో ఎన్నో పాఠాలు

**- ఇబ్బంది లేకుండా ఎగిరిన రాకెట్**



**శ్రీహరికోట (తడ), జూలై 14 ప్రభాతవార్త**

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అమ్ములపొదిలో ఎంతో బలశాలిగా పేరుపొందిన బాహుబలి రాకెట్ ఈ సారి ఎటువంటి ఇబ్బంది లేకుండా గగనతలంలోకి ఘనంగా దూసుకెళ్లింది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం 2019 జూలై 14న అర్ధరాత్రి జిఎస్ఎల్వి మార్క్3 రాకెట్ ద్వారా చంద్రయాన్2 ఉపగ్రహాన్ని ప్రయోగించ తలపెట్టారు. అప్పుడు శాస్త్రవేత్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ రాకెట్ ప్రయోగం ఆఖరు క్షణంలో నిలిచిపోయింది. జిఎస్ఎల్వి రాకెట్లలో ఉపయోగించే క్రయోజనిక్ దశ మళ్లీ ఒడిదుడుకులకు గురైనట్లు భావించారు. అయితే గ్యాస్ లీక్ వల్లే ప్రయోగం ఆగిందని కూడా అన్నారు. అసలేం జరిగిందో తెలుసుకోవడానికి నిపుణుల కమిటీ వేశారు. మళ్లీ రాకెట్‌ను సరిచేసి జూలై 22న చంద్రయాన్-2ను ప్రయోగించారు. అప్పట్లో ఆ ప్రయోగం విజయవంతమైంది. భూకక్ష్యను దాటి చంద్ర కక్ష్యను చేరుకుంది. ఆర్బిటర్ పనిచేసినప్పటికీ చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ జరగలేదు. ఆ రోజున ఇస్రో వర్గాలు పూర్తి నిరాశ చెందినప్పటికీ దేశ ప్రధానితో పాటు కోట్లాది ప్రజానీకం వారికి అండగా నిలిచారు. అప్పట్లో 98 శాతం ఆ ప్రయోగం విజయవంతమైనట్లు పెద్దలు ప్రకటించారు.

## శ్రీచెంగాళమ్మ సేవలో రాష్ట్ర మంత్రి అప్పలరాజు

**సూళ్లూరుపేట, జూలై 14 ప్రభాతవార్త :**



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

అమ్మణ్ణి సేవలో ఎసిబి డిఐజి శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని ఎసిబి డిఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు కార్యనిర్వహన అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎం పద్మజ, కర్లపూడి సురేష్‌బాబు, బండి సునీత తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం హుండీల ద్వారా 1.19 కోట్లు ఆదాయం

**కాణిపాకం, జూలై 14 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంకు హుండీ లెక్కింపు ద్వారా 1.19 కోట్లు రూపాయలు ఆదాయంగా వచ్చింది. శుక్రవారం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో ఆలయ హుండీలను లెక్కించారు. ఈసందర్భంగా 14 రోజులకు గాను హుండీల ద్వారా 1,19,30, 545 రూపాయలు ఆదాయంగా లభించింది. అలాగే 85 గ్రాముల బంగారు, 1 కిలోల 950 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చింది. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా 10,245 రూపాయలు ఆదాయంగా వచ్చింది. దీనితో పాటు 2,648 అమెరికా డాలర్లు, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 80 కెనడా డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు, 75 యూఏఈ దినార్స్ ఆదాయంగా వచ్చింది. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి,రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, మేహ మాలిని, సూపరెండెంట్‌లు రవి, రంగస్వామి, యూనియన్ బ్యాంకు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సమర్థవంతంగా రీ సర్వే

**జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ**

**రామచంద్రాపురం, 14 ప్రభాతవార్త:**



జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రెవెన్యూ అధికారులు చేపడుతున్న భూముల రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఆర్థో రిఫ్లెక్టెడ్ ఇమేజస్ అందించిన వెంటనే రైతుల భూములు రీ సర్వే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. రైతులు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులకు తమ పట్టాదారు పాస్ పుస్తపుకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, ఫోటో, కులం, ఫోన్ నంబర్లు అందించాలని అన్నారు. రెవెన్యూ అధికారులు రైతుల పొలాల వద్దకు చేరుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సమగ్ర సర్వే నిర్వహించి సరికొత్త భూ హక్కు పత్ర ం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జి.సి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ కృష్ణమ్మ, సర్వేయర్ హేమకుమార్, విలేజ్ సర్వేయర్లు, విఆర్ఓ సతీష్‌కుమార్, ప్రసాద్, విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, నాగజ్యోతి, విలేజ్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో

**రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్**



తిరుమల,జూలై 14ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ శుక్రవారం తిరుపతి పర్యటనలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ,జెఇఒ వీరబ్రహ్మం పుష్పగుచ్ఛంతో సాదర స్వాగతం పలికారు.

## సంస్కృతం ప్రపంచంలోని పురాతనభాషలలో ఒకటి

**-రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్**



తిరుపతి,జులై 14ప్రభాతవార్త: సంస్కృతం ప్రపంచంలోని పురాతన భాషల్లో ఒకటని, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ,మైసూర్‌లోని సంస్కృతి ఫౌండేషన్‌ల సహకారంతో జాతీయ సంస్కృత సదస్సును నిర్వహించేందుకు ఆధ్యాత్మిక నగరం తిరుపతిని వేదికగా ఎంచుకోవడం అభినందనీయమని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. దేశంలోని వందలాది విద్యాసంస్థల్లో సంస్కృతం బోధించబడుతూ ఒక సబ్జెక్ట్‌గా కొనసాగుతోందని గుర్తుచేశారు.తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సదస్సు ముగింపుకు ముఖ్యఅతిథిగా గవర్నర్ జస్టిస్ నజీర్ పాల్గొని ప్రసంగించారు. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృతంలో రెండు ప్రసిద్ధ ఉన్నత విద్యాసంస్థలు ఉండటం గర్వకారణమన్నారు. విశ్వవిద్యాలయం లైబ్రరీలో 1,22,946 పుస్తకాలు, సంస్కృతం,తెలుగు,కన్నడ, తమిళం దేవనాగరిగ్రంథం, తెలుగు,కన్నడ,తీగలరి తదితర వివిధ లిపిలలో 6వేలకంటే ఎక్కువ మాన్యుస్క్రిప్ట్‌లు ఉన్నాయన్నారు. దాదాపు 3వేల పురాతన మాన్యుస్క్రిప్ట్‌లు సేకరించి భౌతిక, డిజిటలైజ్ రూపంలో భద్రపరచి పరిశోధకులకు సహాయపడనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోదండరామ ఉత్సవర్లకు పవిత్రాల సమర్పణ

**తిరుపతి,జులై 14ప్రభాతవార్త:** తిరుపతిలో కోదం దరామస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో శుక్రవారం మధ్యాహ్నం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పవిత్రాలు సమర్పించారు. ధృవమూర్తులు, కౌతుకమూర్తులు, ఉత్సవమూర్తులు, విశ్వక్సేన, ద్వారపాలకులు, భాష్యకార్లు, గరుడాళ్వార్, యాగశాలలోని హోమగుండాలు, బలిపీఠం,



ధ్వజస్తంభం, ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామి వారికి పవిత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ డిప్యూటీ ఇఓ నాగరత్న, ఏఇఓ పార్థసారధి, వైఖానస ఆగమ సలహాదారుడు మోహనరంగాచార్యులు, కంకణభట్టార్ ఆనందదీక్షితులు, ఆలయ సూపరింటెండెంట్ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.

# అంతర్గత మార్గాలన్ని ఆధునికరిస్తున్నాం : ఎమ్మెల్యే

**తిరుపతి కార్పొరేషన్, జులై 14 ప్రభాతవార్త :** తిరుపతి నగరంలోని అంతర్గత మార్గాలన్నింటిని ఆధునికరిస్తున్నామని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి నగరంలోని 22వ డివిజన్ పద్మావతి నగర్‌లో సిసి రోడ్డును తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో వున్న అంతర్గత రహదారులన్నింటిని ఆధునికరించడం జరుగుతున్నదని, ఇప్పటికే 95 శాతం పైగా రహదారులను ఆధునికరించడం జరిగిందన్నారు. తిరుపతిలో అభివృద్ధి ఎంత గొప్పగా జరుగుతుందో చెప్పడానికి దేశంలో తిరుపతి నగరం ఆదర్శప్రాయమైనటువంటి నగరంగా దేశంలో తీర్చిదిద్ద



బడుతున్నదన్నారు. అంతర్గత మార్గాలు ఒక వైపున, ఊరి బయట కొత్త మాస్టర్ ప్లాన్ మరో వైపునా రావడంతో, ఎక్కడగాని ట్రాఫిక్ సమస్య రాకుండా కొత్త తిరుపతి నగరాన్ని సృష్టించే స్థాయికి తిరుపతి అభివృద్ధి జరుగుతుందన్నారు. 22వ డివిజన్‌లో రోడ్ల సమస్య ఎక్కువగా వుండేదని, అలాంటిది మొత్తం అన్ని రోడ్లను నవీకరించడం జరిగిందని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ 22వ డివిజన్‌లోశుక్రవారం కోటి ముప్పై ఐదు లక్షలతో సిసి రోడ్డును ప్రారంభించడం జరిగిందని త్వరలో మరికొన్ని రహదారులను ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ పైడి సునీత, కార్పొరేటర్ సంధ్య, కోఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, ఎస్ఈ మోహన్, ఎంఈ చంద్రశేఖర్, డిఈ మహేష్, నాయకులు డిష్ చంద్ర, అనీల్, వెంకటముని, రెడ్డి, మబ్బు నాథమునిరెడ్డి, తిమ్మారెడ్డి, కుమార్, బ్రహ్మానంద రెడ్డి, మాకం చంద్ర, మనోహర్ రెడ్డి, రెడ్డి రాణి తదితరులు పాల్గొన్నారు.